నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు, పిజి, ఎంబిబిఎస్ విద్యార్థులు

నిర్వహణకు నీళ్లు

- జలాశయాల నిర్వహణ బిల్లులు పెండింగ్ - సాగని కొత్త పనులు - భద్రతకు పొంచి ఉన్న ముప్పు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాజెక్టులకు ప్రమాదం పొంచి ఉంది. జలాశయాల నిర్వహణకు నీళ్లొదిలారు. జలాశయాల నిర్వహణకు సంబంధించిన నిధులు పెండింగ్‌లో ఉండటంతో కొత్త పనులు ముందుకు సాగడం లేదు. నిధులు ఇవ్వకపోవడంతో వాటి నిర్వహణ అటకెక్కింది. దీంతో జలాశయాల భద్రతకు ముప్పు పొంచి ఉంది...

అవుకు జలాశయం

ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా 7.10 లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి ఉంది. ప్రధానంగా పోతిరెడ్డిపాడు, బనకచర్లక్రాస్ రెగ్యులేటర్, సుంకేసుల బ్యారేజి, వెలుగోడు, గాజులదిన్నె తదితర జలాశయాలున్నాయి. ఈ ప్రాజెక్టుల నిర్వహణకు గత ప్రభుత్వంలో నిధులు కేటాయించలేదు. గోరుకల్లు జలాశయానికి సంబంధించి గత రెండేళ్లుగా రూ.70 లక్షల బిల్లులు అందడం లేదు. ఈ ప్రాజెక్టుకు మూడు గేట్లు ఉన్నాయి. వీటిలో రెండు మాత్రమే పనిచేస్తుండగా ఒక గేటు నిర్మాణ దశలోనే నిలిచిపోయింది. దీంతో నీటి విడుదలలో సమస్య తలెత్తింది. పోతిరెడ్డిపాడు ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలుగోడు జలాశయం, ఎస్ఆర్‌బిసి, ఎస్కేప్ ఛానల్ ద్వారా వరదనీరు ప్రవహిస్తుంది. ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు గేట్లు కిందికి పైకి ఎత్తడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఇంజనీర్లు చెబుతున్నారు. రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలు అందించే పోతిరెడ్డిపాడు నియంత్రణ వ్యవస్థ వద్ద 10 గేట్లు ఉన్నాయి. వీటి ద్వారా 44 వేల క్యూసెక్కుల వరద జలాలు విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం 40 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి గత మూడేళ్లుగా రూ.56 లక్షల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. తాజాగా మరో రూ.60 లక్షలతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తూ ఎన్నో గ్రామాల దాహార్తి తీర్చే సుంకేసుల జలాశయం నిర్వహణకు నిధుల సమస్య నెలకొంది. 30 గేట్లు ఉన్న ఈ బ్యారేజీ నిర్వహణకు ఏటా రూ.35 లక్షల వరకు నిధులు అవసరం. గత ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం తప్ప నిధులు విడుదల చేయలేదు. గత మూడేళ్లుగా రూ.65 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అవుకు జలాశయానికి ఏర్పాటుచేసిన 6 గేట్లు గత నాలుగన్నర ఏళ్లుగా రెండు గేట్లు పనిచేయడం లేదు. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు రూ.2.50 కోట్ల వ్యయంతో సిద్ధం ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. మిగిలిన 4 గేట్ల నిర్వహణను అరకొర నిధులతో కొనసాగిస్తూ గండికోట జలాశయానికి నీరు విడుదల చేస్తున్నారు. ఆవుకు జలాశయం నిర్వహణకు ఏళ్ల తరబడి నిధులు విడుదల కావడం లేదు. గత ప్రభుత్వం జలాశయాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో గతం నుంచి విమర్శలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం అయినా జలాశయాల నిర్వహణ వైపు శ్రద్ధ చూపి నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా వాసులు కోరుతున్నారు.

వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన
నిందితులను కఠినంగా శిక్షించాలి

- కర్నూలు మెడికల్ కళాశాల నుంచి రాజ్‌విహార్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి జూడాల నిరసన
- జిజిహెచ్‌లో జూనియర్ డాక్టర్ల నిరసన ర్యాలీ, విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కోల్‌కతాలోని ఆర్‌జికార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జూడాల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కళాశాల నుంచి రాజ్‌విహార్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. రాజ్‌విహార్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి జూనియర్ డాక్టర్లు, పిజిలు, ఎంబిబిఎస్ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఆస్పత్రిలో వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ ఘటనపై సిబిఐతో దర్యాప్తు చేయించాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని, వైద్యుల రక్షణ విషయంలో సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని అమలు చేసేలా రాతపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. నాయకులు అచ్యుత్, పవన్ కల్యాణ్, భరత్, భార్గవ్ పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ మద్దతు : కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణంలో ఎపి జూడాలు చేస్తున్న ఆందోళనకు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్‌జికార్ ఆస్పత్రిలో పిజి డాక్టర్ రాత్రి 2 గంటల వరకు వైద్య సేవలందించి, విశ్రాంత తీసుకోవడానికి రూమ్ లేకపోవడంతో సెమినార్ హాలులో నిద్రిస్తుండగా కోల్‌కత్తా పోలీసు విభాగంలో కాంట్రాక్టు పోలీసుగా పనిచేస్తున్న వ్యక్తి, అతనితోపాటు బృందం వెళ్లి అత్యాచారం చేసి హత్య చేశారని తెలిపారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు, పిజిలు ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుస్సేన్ బాష పాల్గొన్నారు.

మద్దతు తెలిపి మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

టమోటా నిల్వకు
కోల్డ్ స్టోరేజీలు

- పంటల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం - కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో అత్యధికంగా రైతులు టమోటా సాగు చేస్తున్న నేపథ్యంలో కోల్డ్ స్టోరేజీలో వాటిని నిలువ చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు పండించిన పంట ఉత్పత్తులకు నేరుగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఐదేళ్ల విజన్ ప్లాన్‌పై కలెక్టర్ సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాల పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఆర్థికాభివృద్ధికి రూ.47,514 కోట్ల నుంచి రూ.95,567 కోట్ల మేరకు పెరిగే విధంగా అభివృద్ధి వ్యూహాలను రచించాలని తెలిపారు. అలాగే తలసరి ఆదాయం రూ.1,74,932 నుంచి రూ.3,51,852లకు పెంచే విధంగా కీలకమైన శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న కూరగాయల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి ఒక పోర్టల్‌ను రూపొందించాలని జిల్లా ఇన్ఫర్మాటిక్ అధికారిని ఆదేశించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి, పాల ఉత్పత్తుల తయారీ, పొట్టేళ్ల పెంపకం వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతంలో సీడ్ పాండ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జెసి మాట్లాడుతూ... ఈనెల 20 నాటికి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

అక్రమంగా తరలిస్తున్న
నాపరాయి లారీ స్వాధీనం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

అక్రమంగా నాపరాయిని తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నామని కర్నూలు జిల్లా మైనింగ్ శాఖ డిడి రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎలాంటి రాయల్టీ, అనుమతులూ లేకుండా నాపరాయి బండలను కనీస భద్రత చర్యలు పాటించకుండా అక్రమంగా తరలిస్తున్న లారీని శుక్రవారం నన్నూరు టోల్ ప్లాజా వద్ద తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై తగిన జరిమానాలను విధించనున్నామన్నారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మైనింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలు..

- రోజూ ప్రమాదాలు...
- స్పందించని ఆర్అండ్‌బి ఇంజినీర్లు
- రేడియో స్టేషన్ నుంచి పెద్దపాడు వరకు పర్యటించిన పిపిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

అడుగడుగునా గుంతలు పడ్డాయని, రోజూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పిపిఎస్ఎస్ నాయకులు విమర్శించారు. ఆర్అండ్‌బి ఇంజినీర్లు స్పందించడం లేదని, నాసిరకం రోడ్లకు, అశాస్త్రీయ డివైడర్లకు రూ.కోట్లు ప్రజాధనం తగిలేస్తున్నారని పిపిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం శివారు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధుల్లో కలిసి వై జంక్షన్ నుంచి పెద్దపాడు మీదుగా వక్కెర వాగు బ్రిడ్జి వరకు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎగుడుదిగుడు రోడ్లు, అడుగడుగునా గుంతలతో రోజూ ప్రమాదాలు జరుగుతూ ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారని తెలిపారు. నాసిరకం రోడ్లు వేస్తూ, అవసరానికి మించి అశాస్త్రీయంగా ట్రాఫిక్ డివైడర్లు నిర్మిస్తూ రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. రెండు కిలోమీటర్ల పరిధిలో అవసరానికి మించి యూటర్న్‌లు ఏర్పాటు చేయడం, నిబంధన ప్రకారం సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడం వల్ల రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వేర్ హౌస్ గోడౌన్ సమీపంలో రోడ్డుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించకుండా ఇరుకైన రోడ్డులో ట్రాఫిక్ డివైడర్ నిర్మించి ప్రమాదాలకు కారణమయ్యారన్నారు. విస్తరణ పేరుతో వేసిన రోడ్లు మూడు నెలలు తిరగకముందే గుంతలు పడుతున్నాయన్నారు. నాసిరకం రోడ్లకు, అవసరానికి మించిన అశాస్త్రీయమైన ట్రాఫిక్ డివైడర్లకు రూ.కోట్లు ఖర్చు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎం.నాగరాజు, శివారు కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు బి.సుకుమార్, పి.సూర్య శేఖర్ పాల్గొన్నారు.

పెద్దపాడు వద్ద వక్కెర బ్రిడ్జిపై గుంతల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ముఖ్యమంత్రిలో రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న హెచ్ఎం విజయలక్ష్మీ

అబ్దుల్ కలాం పాఠశాలకు రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపికయిన సందర్భంగా డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలం ఫౌండేషన్ పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి రాష్ట్రరాజధానిలో సీఎం చంద్రబాబు నాయుడు నుంచి రాష్ట్రస్థాయి అవార్డును స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలకు అందజేసే విభాగంలో కర్నూలు జిల్లా నుండి ఈ పాఠశాల ఎంపికయింది. మూడోసారి వరుసగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న పాఠశాలగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మిని జిల్లా కలెక్టర్ రంజిత్ భాష, జిల్లా విద్యాశాఖ అధికారి కె. శామ్యూల్, ఎడి సామ్యూల్ పాల్ అభినందించారు

ఇప్పటివరకు పని చేస్తున్న కార్మికులను కొనసాగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు పనిచేస్తున్న వారిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని ఆలోచనను విరమించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి .అంజిబాబు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నగరం విస్తరించడం వల్ల కార్మికుల సంఖ్య పెంచుకోవడం అవసరమన్నారు. పాతవారిని తొలగించి కొత్తవారిని పెట్టుకోవడం సరైనది కాదని అన్నారు. పాతవారిని కొనసాగిస్తూనే కొత్తగా కార్మికులను తీసుకొని కార్మికులకు పని భారం తగ్గించాలని కోరారు. గతంలో అనేక రోజులుగా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను తొలగించడం అన్యాయమని అన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న 90 మందిని తొలగించి వారి స్థానంలో 200 మందిని తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తుందని, ఒకసారి పనిలో పెట్టుకున్న తర్వాత వారిని పని నుంచి తొలగించే హక్కు ఎవరికీ లేదని అన్నారు. పాత వారిని కూడా కొనసాగించాలని లేదంటే వారి తరపున సిఐటియు ఆందోళనకు పూనుకుంటుందహచ్చరించారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి దేవదాసు మృతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగపు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి దేవదాసు విధుల్లో భాగంగా రాజ్ వీహర్ కూడలి, అంబేద్కర్ భవన్ ఎదురుగా ఉన్న డివైడర్ మధ్యనున్న మొక్కలకు నీళ్ళు పోస్తుండగా విద్యుత్ షాక్‌తో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న నగర మేయర్ బి.వై. రామయ్య, కమిషనర్ పివి. రామలింగేశ్వర్ విచారం వ్యక్తంచేశారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపి, బాధిత కుటుంబానికి అండగా నిలబడతామని, అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

దంత సమస్యలకు సత్వర పరిష్కారం

నేడు శ్రీవెంకటయి రాయల్ డెంటల్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజల దంత సమస్యలను పరిష్కరించేందుకు శ్రీ వెంకట సాయి రాయల్ డెంటల్ క్లినిక్‌ను ఈనెల17న ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. కర్నూలు కొత్తబస్టాండు యశోద హాస్పిటల్ చల్లా వారి వీధిలో కొత్తగా రాయల్ డెంటల్ క్లినిక్‌లో డాక్టర్ సాయి పంకజ్ జెవిబిడిఎస్ఎమ్ ఆర్ డి, ఫోరెన్సిక్, ఒ డెంటలోజిస్ట్, కాస్మటిక్ డెంటల్ సర్జన్ ఆధ్వర్యంలో దంత సమస్యల పరిష్కారం శస్త్ర చికిత్సలను అధునాతన వైద్య పరికరాలతో ప్రారంభించబోతున్నారు. ఆయన రాజరాజేశ్వరి డెంటల్ కాలేజ్ బెంగళూర్, ఎంఆర్‌డి ఫెలోషిప్ ఎయిడ్స్ హైదరాబాద్‌లో చదువుకున్నారు. ఆయన

డాక్టర్ సాయి పంకజ్

మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే దంత ఆరోగ్యం ముఖ్యమైనదన్నారు. ఆరోగ్యమైన దంతాల కోసం దంత సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు ఈ వైద్యశాలను సందర్శించి పంటి సమస్యలను పరిష్కరించుకొని చిరు మందహాసంతో తిరిగి వెళ్లాలని అన్నారు. మానవుని ముఖంలో నాలుగు రకాల దంతాలు ఉంటాయి. **గుంతకలు:** వీటిని పెద్ద దంతాలు కింద రెండు పైన రెండు ఉంటాయి వీటిని కొరకు దంతాలు అని కూడా అంటారు. **ప్రాథమికలు:** వీటిని కోర దంతాలు అంటారు ఇవి పైన రెండు కింద రెండు చాలా పదునుగా ఉంటాయి. వీటి ద్వారా ఆహారాన్ని చీల్చడానికి ఇవి పనికి వస్తాయి. **సర్వ రకాలు:** వీటిని నమి లేదంతాలు అంటారు. ఇవి కింద నాలుగు పైన నాలుగు ఉంటాయి. **అగ్ర సర్వ రకాలు:** వీటిని విసిరే దంతాలు అంటారు. ఇది కింద పైన 12 ఉంటాయి. వీటిని (కో.కో. న.వి) అనగా కొరికే , కోర, నమిలే, విసిరే దంతాలు అంటారు. ఇక జ్ఞాన దంతాలు ప్రతి మనిషిలో 18 నుండి 24 సంవత్సరాల లోపు ఈ జ్ఞాన దంతాలు వస్తాయి.

క్లినిక్‌లోదంత చికిత్సలు: రెగ్యులర్ డెంటల్ చెక్ అప్, దంతాలు శుభ్రపరచడం, పుచ్చు పళ్ళు వాటిని సిమెంట్‌తో నింపడం, రూట్ కెనాల్ ట్రీట్మెంట్, ఎట్రాక్షన్, ఎక్స్ట్రాక్షన్, సర్జికల్ఎక్స్ట్రక్షన్స్, డెంటల్ క్యాప్స్, పోయిన దంతాలు భర్తీ చేయడం, కట్టుడు పళ్ళు, ఆర్థోడాన్సిక్ చికిత్స, చిగుళ్ల వ్యాధి చికిత్స (పీరియా డొంటల్ థెరపీ), లేజర్ సర్జరీ, డెంటల్ ఇంప్లాంట్లు, కాస్మెటిక్ డెంటల్ కేర్, లాంటి చికిత్సలు కూడా చేస్తారు. సంప్రదించవలసిన సెల్ నెంబర్. 8143946666.

అభివృద్ధేలక్ష్యంగా ప్రభుత్వం ముందుకు

ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం పసుపల నుంచి గార్గేయపురం వరకు 10 కిలోమీటర్ల మేర రూ.4.80 కోట్లతో చేపడుతున్న రోడ్డు ఆధునీకరణ పనులను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిప రెండు నెలల్లోపే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చెప్పటిందన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు..ఇక పసుపల నుంచి గార్గేయపురం వరకు సరైన రోడ్డు లేక గత కొన్ని సంవత్సరాల నుంచి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. రోడ్డు ఆధునీకరణ పనులను త్వరగా పూర్తి చేసి రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రుద్రవరం గ్రామంలో పర్యటించారు. గ్రామ ప్రజలు టిడిపి నాయకులు వారకి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామం లోని సమ స్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం సర్పంచులకు ఎలాంటి అధికారాలు, నిధులు ఇవ్వకుండా గ్రామాలను అభివద్ధికి దూరం చేసిందన్నారు. పసుపుల గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరును పరిశీలించారు. సెక్రటరీలు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని పంచాయతీ సెక్రెటరీ అడిగి తెలుసుకున్నారు. పసుపల, రుద్రవరం టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ఎంపి నాగరాజు, ఎమ్మెల్యే దస్తగిరి

విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి

కేంద్రీయ విద్యాలయంలో మొక్కలు నాటిన డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు చిన్నతనంనుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. కర్నూలు కేంద్రీయ విద్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శంకర్ శర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ పాయాల్ ప్రియదర్శనితో కలిసి డాక్టర్ శంకర్‌శర్మ కోకో, వాలీబాల్ కోర్టులను ప్రారంభించి అక్కడే మొక్కలు నాటారు. ఈసందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల కృషి వల్లే నేడు మనమందరం స్వేచ్ఛా జీవితాన్ని అనుభవిస్తున్నామని అన్నారు. స్వాతంత్ర్య సమరయెధుల గొప్పతనాన్ని డాక్టర్ శంకర్ శర్మ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తిని కలిగిఉండాలన్నారు. ప్రిన్సిపల్ ప్రియదర్శని మాట్లాడుతూ డాక్టర్ శంకర్ శర్మ ఆర్థిక సహాయసహకారాలు, విద్యార్థుల పట్ల సేవానిరతి ప్రసంశనీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఫలాలను అందిపుచ్చుకునే భాద్యత గల పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా చిన్నారులు దేశభక్తి గీతాలకు డ్యాన్స్ చేసి అలరించారు.

కోకో, వాలీబాల్ కోర్టులను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ ,ప్రిన్సిపల్ ప్రియదర్శిని

దోషులను కఠినంగా శిక్షించాలి:ఎపిఎంఎస్ఆర్‌యు

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్ : కోల్‌కతా ఆర్‌జి కార్ హాస్పిటల్లో వైద్య విద్యార్థినిని అత్యంత దారుణంగా అత్యాచారం చేసి హత్య చేయడాన్ని ఎంపిఎంఎస్ఆర్‌యు తీవ్రంగా ఖండిస్తోందని జిల్లా కార్యదర్శి వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దుర్ఘటనకు వ్యతిరేకంగా ఆగస్టు ఈనెల15న జూనియర్ డాక్టర్లపై కొంతమంది దుండగులు అమానుషంగా ప్రవర్తించడాన్ని తీవ్రమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ఈ ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు ఆగస్టు 17న ఉదయం 6 గంటల నుండి 18 వరకు 24 గంటలు వైద్య సేవలు నిలిపివేయుటకు సంఘం తీర్మానించిందన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి సంపూర్ణ సంఘీభావం తెలుతామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దుర్ఘటనపై నిష్పక్షపాతంగా విచారించి దోషులను కఠినంగా శిక్షించాలని, డాక్టర్లకు, వైద్య విద్యార్థులకు రక్షణ చట్టాలను తేవాలన్నారు.

ప్రారంభానికి నోచని సంత మార్కెట్ ముందు నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఆదాయాన్ని కోల్పోతున్న పంచాయతీ

- బహిరంగ వేలం వేసి దుకాణాలు ప్రారంభించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు పంచాయతీ ఆదాయం కోల్పోతుందని సిపిఎం మండల కార్యదర్శి షాకీర్, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. ఆలూరు సంత మార్కెట్‌లో రూఅర్బన్ స్కీంతో రూ.1.20 లక్షలతో నిర్మించిన 29 షాపులను, మండల పరిషత్ వాణిజ్య సముదాయం రూ.80 లక్షలతో నిర్మించిన 16 షాపులను ప్రారంభించి బహిరంగ వేలం వేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరు సంత మార్కెట్‌లో ప్రారంభానికి నోచని కూరగాయల వ్యాపార సముదాయాన్ని ప్రారంభించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిధులు మంజూరయి దుకాణాల నిర్మాణం పూర్తి చేసి నాలుగేళ్లయినా ప్రారంభించడం లేదని తెలిపారు. గత పాలకుల ఒత్తిళ్లకు, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన పంచాయతీ, మండల, డివిజన్, జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పంచాయతీకి రూ.లక్షలు గండి కొట్టడమే కాకుండా నిరుద్యోగులు నాలుగేళ్లుగా ఉపాధి కొల్పోయారని తెలిపారు. సర్పంచి, అధికారులు నిర్ణయం తీసుకుని తక్షణమే సంత మార్కెట్ వ్యాపార సముదాయాన్ని ప్రారంభించి బహిరంగ వేలం వేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం, డివైఎఫ్ఐ, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో షాపుల తాళాలు పగులగొట్టి నిరుద్యోగులకు అందజేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు ఈరన్న, కృష్ణ, విఠల్, స్థానికులు పాల్గొన్నారు.

వైద్యురాలి అత్యాచార ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి : ఎన్ఎస్‌యుఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గాంధీ విగ్రహం ముందు నిరసన చేపడుతున్న నాయకులు

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జి కార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలి అత్యాచార, హత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్, ఎమ్మిగనూరు కాంగ్రెస్ నాయకులు ఖాసీంవలీ కోరారు. శుక్రవారం స్థానిక గాంధీ విగ్రహం ముందు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యువ కాంగ్రెస్ నాయకులు దాదా ఖలందర్, అనంత్ కుమార్, విష్ణు, రాజు, విజయ్, హర్ష, వినోద్, హరి, ధరణి నాథ్, సూర్య పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ట్యాంకు బండ రోడ్డు ప్రాంతంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. అలాగే గాంధీనగర్ ట్యాంకు బండ రోడ్డులో మేజర్ డ్రెయినేజీ పూడికతీత పనులను పరిశీలించారు. గత మూడేళ్లుగా డ్రెయినేజీలో పూడిక పేరుకుపోయిందని, భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. అలాగే దోమల సమస్య కూడా తగ్గుతుందన్నారు. ప్రజలు గూడా పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

ప్రజాశక్తి - ఆదోని

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. శుక్రవారం లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ జిల్లా ఛైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు మాట్లాడుతూ... దేశానికి మూడు సార్లు ప్రధానమంత్రిగా పనిచేసి, పేదలకు గృహాలు, రవాణా సౌకర్యం, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో విశిష్టమైన సేవలు అందించారని కొనియాడారు. అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్ గుప్తా, సభ్యులు వన్నపరాజు పాల్గొన్నారు.

మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- రావూస్ కళాశాలలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యువత, విద్యార్థులు మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆదోని పట్టణ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎల్.సాయి సుభాష్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సాయి సుభాష్, ఆదోని పట్టణ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జడ్జి బి.అర్చన, గౌరవాతిథులుగా ఎమ్మిగనూరు పట్టణ సిఐ బి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురురాజారావు, కార్యదర్శి రఘురాం, సీనియర్ అడ్వకేట్లు మురళీకృష్ణ, విమల హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయి సుభాష్ మాట్లాడారు. రెండు రకాల డ్రగ్స్ ఉన్నాయని, అవి లీగల్ డ్రగ్స్, ఇల్లీగల్ డ్రగ్స్ అని తెలిపారు. లీగల్ డ్రగ్స్ అనేవి డాక్టర్ ప్రిస్కిప్షన్ మందులు, మెడికల్ షాపులో అమ్మే మందులు, వీటిని అతిగా వినియోగించడం వల్ల శరీరంలోని నాడీవ్యవస్థ, కిడ్నీల మీద ప్రభావం చూపుతుందని చెప్పారు. మందులను అతిగా వినియోగించడం మానేయాలని సూచించారు. ఇల్లీగల్ డ్రగ్స్ అనేవి ప్రభుత్వం నిషేధించిన మందులు గంజాయి, వివిధ మత్తు పదార్థాలకు సంబంధించినవని, అవి జీవితాన్ని పాడు చేస్తాయని తెలిపారు. కొంతమంది యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవడమే కాకుండా కుటుంబంలో తల్లిదండ్రులకు తీరని భారంలా మిగిలిపోతున్నారని చెప్పారు. ఒకవేళ డ్రగ్స్ వినియోగంలో నేరం రుజువైతే కఠిన శిక్ష పడుతుందని, ఇందుకు పోలీసు శాఖ కూడా కఠినంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు చట్టవిరుద్ధమైన మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. అది ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని తెలిపారు. ఆదోని పట్టణ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జడ్జి బి.అర్చన మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు మంచి మార్గాలను అనుసరించి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎమ్మిగనూర్ సిఐ బి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో యువత మంచి అలవాట్లు అలవరచుకుని, చెడు స్నేహితులకు దూరంగా ఉండాలని తెలిపారు. కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి మాట్లాడుతూ... డ్రగ్స్ నివారణపై తమ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడం సంతోషం కలిగిస్తోందని చెప్పారు. ముఖ్య అతిథులకు, గౌరవాతిథులకు కళాశాల సిఇఒ సన్మానం చేశారు. కళాశాల సిఒఒ సుజనారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సాయి సుభాష్

రహదారికి మరమ్మతులు చేపట్టండి

- వరద ధాటికి కొట్టుకుపోయిన గ్రావెల్

ప్రజాశక్తి - చిప్పగిరి

గత నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి చిప్పగిరి, దౌల్తాపురం గ్రామాలకు వెళ్లే రహదారి మధ్యలో కల్వర్టు చుట్టూ ఉన్న గ్రావెల్ కోతకు గురై కొట్టుకుపోయింది. రహదారి లేకుండా ఛిన్నాభిన్నమైందని ఇరు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు తెలుపుతున్నారు. దౌల్తాపురం రైతులు, ఇటు చిప్పగిరికి చెందిన రైతులు పొలాలకు వెళ్లాలంటే ఏకైక మార్గం ఈ రహదారి అని తెలిపారు. పొలాల్లో పనులు చేసుకోవడానికి లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తెగిపోయిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరుతున్నారు. నంచర్ల, దౌల్తాపురం గ్రామాలకు చెందిన ప్రజలు బ్యాంకు నిమిత్తం, ప్రభుత్వ కార్యాలయంలో పనులు చేసుకోవడానికి ఈ రహదారి వెంటే రావాల్సి ఉంది. ఈ గ్రామాలకు చెందిన వారు గుంతకల్లుకు వచ్చి అటు నుంచి చిప్పగిరికి వస్తున్నారు. ఇలా చుట్టూ రావాలంటే దాదాపు 40 కిలోమీటర్లు అవుతుంది. ఇలా చుట్టూ లేకుండా నంచర్ల గ్రామం నుంచి చిప్పగిరికి చేరుకోవాలంటే 12 కిలోమీటర్లు పడుతుంది. ఈ ఇబ్బందులన్నీ తొలగిపోవాలంటే త్వరగా కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరుతున్నారు.

వరదకు కొట్టుకుపోయిన కల్వర్టు

నేడు ఆదోనిలో వైద్య సేవల నిలిపివేత

- ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని



కోల్‌కత్తాలో వైద్యురాలి అత్యాచారం, హత్యను నిరసిస్తూ శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రయివేట్ ఆస్పత్రుల్లో (అత్యవసర సేవలు తప్ప) వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఎ ఆదోని శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ మధు, కోశాధికారి డాక్టర్ ఆదిత్య, సందీప్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. వైద్య సిబ్బందికి కేంద్ర రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి, సిబిఐతో త్వరగా నేర పరిశోధన పూర్తి చేసి, నేరానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడేలా చూడాలని కోరారు. ప్రభుత్వాలు తీసుకునే చర్యలను బట్టి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ప్రజలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పక్షాలూ మద్దతు ఇవ్వాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు వాయిదా

- తహశీల్దార్ రవి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులు వాయిదా పడ్డాయని తహశీల్దార్ ఎ.రవి తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో భూ సంబంధిత సమస్యలపై ప్రభుత్వం మొదట ఈ నెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని తలపెట్టిందని చెప్పారు. మళ్లీ వాయిదా వేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రెవెన్యూ సదస్సుల తేదీలను ప్రకటిస్తామని తెలిపారు.

గుండె నొప్పితో రైతు మృతి

- అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనోవేదనకు గురైన రైతు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిన్న రంగస్వామి (ఫైల్)

అప్పులు ఎక్కువ కావడంతో తీర్చలేక మనోవేదనకు గురై గుండెపోటుతో రైతు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని నగరడోనా గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బంధువుల వివరాల మేరకు... మృతుడు గొల్ల చిన్న రంగస్వామి (48)కు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. పొలం కొద్దిగా ఉంది. అప్పులు దాదాపు రూ.15 లక్షల వరకు ఉండడంతో ఎలా తీర్చాలో అనే మనోవేదనకు గురయ్యారు. ఛాతిలో ఎక్కువ నొప్పి రావడంతో గుంతకల్లు ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు. రంగస్వామి కుటుంబానికి ఆర్థిక చేయూతనందించి ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు

- పత్తి రైతులతో టెలికాన్ఫరెన్స్‌లో ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ప్రస్తుత పరిస్థితుల్లో పత్తిలో గులాబీ పురుగు ప్రధాన సమస్యగా ఉందని, ఈ పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కెవికె కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త కె.రాఘవేంద్ర చౌదరి తెలిపారు. శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలం ఎర్రబాడు, ఒంటెడుదిన్నె, గంజిహళ్లి గ్రామ పత్తి రైతులకు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ముందుగా ఎకరాకు 8 లింగాకర్ష బుట్టలను పెట్టుకోవాలని తెలిపారు. కలుపు మొక్కలను ఏరి వేయాలని, గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గడానికి గడ్డి పూలను ఎరివేయాలని సూచించారు. పురుగుల నష్టపరిమాణం దృష్టిలో ఉంచుకొని లీటరు నీటికి క్వినాల్ ఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 3 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ట్రైజోఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా థయోడికార్బ్ 1.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని తెలిపారు. పచ్చ పురుగు గుడ్లు ఎక్కువగా ఉంటే ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా ట్రైజోఫాస్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటి మోతాదులో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. ఒకే మందు ఎక్కువసార్లు పిచికారి చేయకుండా మందులు మార్చి వాడుకోవాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ జోనల్ మేనేజర్ ప్రకాష్, జిల్లా ప్రతినిధి నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాఘవేంద్ర చౌదరి

హంద్రీనీవా నీటితో సస్యశ్యామలం

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని హంద్రీనీవా సాగునీటి ప్రాజెక్టు ద్వారా పొలాలను సస్యశ్యామలం చేస్తామని టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. శుక్రవారం పందికోన రిజర్వాయర్‌ను సందర్శించి కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వైసిపి పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు ఎటువంటి నిధులను విడుదల చేయలేదని, ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని వేదవతి ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూ.1,980 కోట్లు కేటాయించినప్పటికీ కేవలం రూ.100 కోట్లను మాత్రమే విడుదల చేసి పనులు చేస్తున్నామని గొప్పలు చెప్పుకున్నారే తప్ప ఎటువంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. హంద్రీనీవా పెద్ద కాలువల నుంచి పందికోన రిజర్వాయర్‌లోకి వచ్చే నీటి మోరిని మరింత పెద్దగా నిర్మించి ఎక్కువ నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. సకాలంలో వర్షాలు కురవడం లేదని, కాలువల ద్వారా వచ్చే నీటిని మండల రైతులు సద్వినియోగం చేసుకొని పంటలు పండించుకోవాలని కోరారు. టిడిపి మండల నాయకులు బడిగింజల రంగన్న, వెంకటస్వామి గౌడ్, రామారావు నాయుడు, కప్పట్రాళ్ల మల్లికార్జున, చిట్యాల రామాంజనేయులు, రంగడు, బండ్లయ్య, రాజా సాబ్, సుభాన్, చింతా మధుసూదన్, జనసేన పార్టీ నాయకులు ఉచ్చీరప్ప, వీరేష్, జగదీష్, నందు, చంటిబాబు పాల్గొన్నారు.

కాలువ నీటికి జలహారతి ఇస్తున్న వీరభద్రగౌడ్

ఓవర్ బ్రిడ్జి వద్ద మరమ్మతులు చేపట్టాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని మేదరిగేరి ఓవర్ బ్రిడ్జి వద్ద గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.అజయ్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోనిలోని ఓవర్ బ్రిడ్జి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇనుప రాడ్లు లేచి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఓవర్ బ్రిడ్జి నుంచి శిరుగప్ప క్రాస్ రోడ్డు వరకు ధ్వంసమైన ప్రధాన రహదారిని బాగు చేయడంలో ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తరలించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న, అధ్యక్షులు వైటి.భీమేష్, జిల్లా సమితి సభ్యులు కల్లుబావి రాజు, సి.హుస్సేని, షేక్షావలీ, గోవిందు, ప్రకాష్, తాయన్న పాల్గొన్నారు.

కులగణనతోనే ఎస్సీ వర్గీకరణ ఫలాలు

- ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో ఎస్సీలకు వర్గీకరణ ఫలాలు అందాలంటే కులగణనతోనే సాధ్యమని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీల చిరకాల స్వప్నం సాకారమైందని సంబరాలు చేసుకోవడం కాదని తెలిపారు. గతంలో ఎస్సీల్లో కేవలం 59 ఉప కులాల ఉండేవని, ప్రస్తుతం రాజకీయ స్వార్ధ ప్రయోజనాల వల్ల 62కు పెరిగాయని చెప్పారు. ఎస్సీ ఎబిసిడి వర్గీకరణ అమలు అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాల ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణతో రిజర్వేషన్ల సౌకర్యం ఉంటుందని చెప్పడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎస్సీల్లో అసలైన ఉప కులాలను బయటకు తెచ్చేందుకు కుల గణన ఒక్కటే మార్గమని తెలిపారు. అప్పుడే రిజర్వేషన్ల ప్రక్రియ అమలు సులభతరం అవుతుందని చెప్పారు. జిల్లా నాయకులు ఏబు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలి

- డీఎస్పీకి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఆదోని

మంత్రాలయం మండలం రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో విద్యార్థిని పార్వతి మృతిపై సమగ్ర విచారణ జరిపించి నిందితులను శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ డీఎస్పీ సోమన్నకు ఆదోని కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. మంత్రాలయం మండలం రచ్చుమరి మోడల్ స్కూల్‌లో పది రోజుల క్రితం పార్వతి మృతి చెందారని, ఘటన వెనక చాలా సందేహాలు వస్తున్నాయన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. రాత్రి 7 గంటల వరకు పనిచేసిన సిసి కెమెరాలు తర్వాత పనిచేయకపోవడం, పోస్టుమార్టం రాత్రి 9 గంటలకు చేయడం ఇదంతా చూస్తుంటే అనుమానాలకు దారితీస్తుందని తెలిపారు. పార్వతి ఆత్మహత్య చేసుకునే పిరికి అమ్మాయి కాదని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారని చెప్పారు. దీనిపై త్వరగా విచారణ చేసి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, గౌస్, యశ్వంత్ రాజు ఉన్నారు.

డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇన్‌ఛార్జీ ఎపిఎంకు ఉత్తమ సేవా పత్రం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని వెలుగు కార్యాలయంలో ఇన్‌ఛార్జీ ఎపిఎంగా పనిచేస్తున్న ముక్కన్నకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పత్రం దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం కర్నూలులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి టిజి.భరత్, కలెక్టర్ రంజిత్ బాష, ఎస్పీ బిందు మాధవ్ చేతుల మీదుగా ఆయన ఉత్తమ సేవా పత్రాన్ని అందుకున్నారు. ఆయనకు అవార్డు అందడం పట్ల వెలుగు కార్యాలయ సిసిలు కృష్ణుడు, లలిత, శకుంతల శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. డ్వాక్రా మహిళలు, విఒఎలు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

ఉత్తమ సేవా పథకం అందుకుంటున్న ముక్కన్న

శ్రీమఠానికి వెండి విరాళం

- మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠానికి భక్తుల నుంచి కిలో వంద గ్రాముల వెండి గట్టిని విరాళంగా ఇచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన వారు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం ఆర్నా, ఆర్నవ్ ఒక కిలో 100 గ్రాముల బరువున్న ఒక వెండి గట్టిని విరాళంగా ఇచ్చారని తెలిపారు.

విద్యార్థులకు ఉపాధ్యాయుని ప్రోత్సాహం

ప్రజాశక్తి - గోనెగండ్ల

నగదు బహుమతి అందజేస్తున్న ఉస్మాన్

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జె.ఉస్మాన్ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. తమ పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు ఏటా నగదు బహుమతులతో ప్రోత్సహించి తన వంతు సహకరిస్తున్నారు. 2023–24 బ్యాచి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు రూపరాణి, షైనాజ్, ఐశ్వర్యకు రూ.3వేలు, రూ.2 వేలు, రూ.1000 చొప్పున స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందజేశారు. గత 15 ఏళ్లుగా తాను పనిచేసే ప్రతి పాఠశాలలో ఇదేవిధంగా ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం, విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఉరుకుందప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

ప్రజాశక్తి - కౌతాళం

ప్రభుత్వ పథకాలపై కౌతాళం ఎంపిడిఒ కార్యాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్‌తో ఎంపిడిఒ సుబ్బరాజు సమీక్ష నిర్వహించారు. శుక్రవారం వివిధ పథకాలపై పెండింగ్‌లో ఉన్న యూనిట్లపై చర్చించారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛను గతేడాది సంవత్సరం కింద తోడు పథకానికి సంబంధించి పెండింగ్ ఉన్న యూనిట్లను పూర్తి చేయడం, బయోమెట్రిక్ అటెండెన్స్, ప్రభుత్వం నుంచి రాబోయే చంద్రన్న బీమా, కొత్త పింఛన్ల మార్గదర్శకాలపై సమీక్ష నిర్వహించారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ ఉమేష్, మణి, స్వామి, వంశీ, నరసింహ యాదవ్, మధు సింగ్, రాజకుమార్, శబరీష, బూడదొడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

అవోపా ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు

- మాజీ అధ్యక్షులు నగేష్ కాకుబాళ్

ప్రజాశక్తి - ఆదోని

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఆర్యవైశ్య ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతిరామ్ హాస్పిటల్ సౌజన్యంతో ఈనెల 18న ఆదోనిలోని ఎస్‌కెడి కాలనీ అయ్యప్ప స్వామి గుడి వద్ద ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆ సంఘం మాజీ అధ్యక్షులు నగేష్ కాకుబాళ్, పట్టణ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని కార్యాలయంలో ఉచిత శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నంద్యాల శాంతిరాం హాస్పిటల్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యంతో ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపాలనే సంకల్పంతో గతంలో కూడా వందల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు చెప్పారు. సంతానం లేని వారికి ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారన్నారు. ఈ అవకాశాన్ని కంటి చూపు సరిగా లేనివారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యులు రఘు, కోశాధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్ రంజిత్, మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, గీత, శ్రీదేవి, అనూష పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేత

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కర్నూలు సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 'స్వాతంత్ర్య భారతదేశం – దాని ఫలాలు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 6, 7వ తరగుతల విద్యార్థులకు జాతీయ నాయకుల బొమ్మలు గీయడంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులతో పాటు సుందరయ్య విజ్ఞాన కేంద్రం వారి ప్రశంసాపత్రాలు అందజేసినట్లు ఉపాధ్యాయులు గుమ్మల బాబు, అబ్దుల్ సలీం తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు వారి మేధస్సుకు పదును పెట్టినట్లు అవుతుందని అన్నారు. ఉపాధ్యాయులు తాజుద్దీన్, మహబూబ్ బాష, షఫీ, నాగమణి, ఉమా పాల్గొన్నారు.

NAME CHANGE

WE, BARIKI. RAMUDU S/O BARIKI HANUMANTHAPPA.BARIKI NAGAMANI W/O BARIKI RAMUDU.(OLD NAMES) R/O H.NO. 23/448, KARVENPET, ADONI, KURNOOL DIST., A.P.,

WE CHANGED OUR NAMES AS BESTHA.RAMUDU S/O BESTHA.HANUMANTHAPPA,BESTHA.NAGAMANI W/O BESTHA.RAMUDU HENCEFORTH WE WILL BE KNOWN AS BESTHA.RAMUDU AND BESTHA.NAGAMANI.